సాక్షి ప్రకాశం

మంగళవారం | 2 | మే | 2023



చిన్నారులకు మెరుగైన సేవలందించాలి

చిన్నారులకు మెరుగైన సేవలందించాలని మంత్రి సురేష్ అన్నారు. పెద్దదోర్నాలలో ఐసీడీఎస్ కార్యాలయం ప్రారంభించడంతో పాటు, ఫిష్ ఆంధ్ర మొబైల్ వాహనాలు అందజేశారు. - 8లో..



ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ఇంటర్మీడియెట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32 /24

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇంటర్మీడియెట్ విద్య కమిషనర్ ఉత్తర్వులపై హర్షం

ఒంగోలు: రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ లెక్చరర్లకు ఏడాదికి 15 క్యాజువల్ లీవులు, మహిళలకు అదనంగా మరో 5 సెలవులు వర్తింపజేస్తూ ఇంటర్ విద్య కమిషనర్ ఎంవీ శేషగిరిబాబు ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ప్రభుత్వ కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. 2023-24 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీసును రెన్యువల్ చేసే ప్రక్రియలో ఏర్పడిన ప్రతిష్టంభన తొలగించాలని కోరుతూ పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, ఇంటర విద్య కమిషనర్ ఎంవీ శేషగిరిబాబులకు వినతిపత్రం అందించారు. దీనిపై ముఖ్య కార్యదర్శి సానుకూలంగా స్పందించారని కుమ్మరికుంట సురేష్ పేర్కొన్నారు.

శంకర స్వామిజీ ఆశీర్వాదం తీసుకున్న ఎంపీ మాగుంట



స్వామీజీ ఆశీర్వాదం తీసుకుంటున్న ఒంగోలు ఎంపీ మాగుంట

ఒంగోలు: విజయయాత్ర నిర్వహిస్తున్న శంకర విజయేంద్ర సరస్వతి స్వామిజీని నెల్లూరు జిల్లా జొన్నవాడలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కలుసుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి నుంచి ఆశీర్వాదం పొందారు. జొన్నవాడలోని కామాక్షమ్మ దేవస్థానానికి కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వచ్చారు.

7న జిల్లా స్థాయి చెస్ సెలక్షన్స్

ఒంగోలు: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో ఈనెల 7న ఆంధ్ర చెస్ అసోసియేషన్ సహకారంతో జిల్లా స్థాయి సీనియర్ ఓపెన్, ఉమెన్ చెస్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి షేక్ అబ్దుల్ నబి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9494427319 ను సంప్రదించాలన్నారు.

విత్తనాలు, ఎరువుల పంపిణీకి చర్యలు

- జేడీఏ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జేడీఏ శ్రీనివాసరావు

మార్కాపురం: రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని జేడీఏ శ్రీనివాసరావు ఆర్బీకే సిబ్బందిని ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో రాబోయే ఖరీఫ్ సీజన్లో చేపట్టాల్సిన చర్యలపై ఆర్బీకే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. జేడీఏ మాట్లాడుతూ.. రైతు భరోసా, పీఎం కిసాన్ పథకానికి అర్హులైన రైతులు ఉంటే గుర్తించి ఈ నెల 3వ తేదీలోపు వెబ్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ నవీంద్ర మాట్లాడుతూ.. 5 ఎకరాల్లోపు రైతులకు 90 శాతం సబ్సిడీపై, 5 నుంచి 10 ఎకరాల్లోపు రైతులకు 70 శాతం, 10 ఎకరాల పైన ఉన్న రైతులకు 50 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందిస్తామన్నారు. జిల్లా ఉద్యానాధికారి గోపీచంద్, ఏడీఏ రమాదేవి పాల్గొన్నారు.

మత్తు దిగుతోంది



కుటుంబాలను చిన్నాభిన్నం చేసే మద్యం మహమ్మారి నుంచి ప్రజలను బయటపడేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న మద్య నియంత్రణ చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. మద్యం ధరలు పెంచడం, ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా నిర్ణీత వేళల్లోనే పరిమితంగా మద్యం విక్రయాలు సాగించడం వంటి చర్యలతో మద్యానికి బానిసలైనవారు క్రమంగా దానికి దూరమవుతున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మద్యం విక్రయాలతో పోల్చుకుంటే ఈ ఏడాది మద్యం విక్రయాలు గణనీయంగా తగ్గిపోవడమే దీనికి నిదర్శనం.

- టీడీపీ హయాంతో పోల్చుకుంటే మద్యం అమ్మకాల్లో 17 శాతం తగ్గుదల
- 51.13 శాతం తగ్గిన బీరు అమ్మకాలు
- ఏప్రిల్‌లో 50 శాతానికిపైగా తగ్గిన విక్రయాలు
- ప్రజల్లో ఆరోగ్యంపై పెరిగిన శ్రద్ధ
- సత్ఫలితాలిస్తున్న ప్రభుత్వ చర్యలు

ఒంగోలు:

జిల్లాలో మద్యం విక్రయాలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. గతంలో మద్యం లేనిదే ఉండలేమన్న మందుబాబులు సైతం అడపా, దడపా పండుగకు..పబ్బానికే ఒక పెగ్గు అనే పరిస్థితికి వచ్చారు. నాలుగేళ్లుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నేరుగా ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా మద్యం విక్రయిస్తోంది. పరిమిత సంఖ్యలో మాత్రమే మద్యం ఇవ్వడం, సమయపాలన తప్పనిసరి చేయడం తదితర కారణాలతో మద్యం అమ్మకాలు గణనీయంగా తగ్గాయి. ప్రభుత్వ చర్యలతో చదువుల భారం తగ్గడం, ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతుండడంతో అప్పుల బాధలతో సతమతమవుతూ వాటి బారి నుంచి ఉపశమనం కోసం మద్యం మత్తులో తూగేవారు సైతం నేడు దానికి దూరంగా ఉంటున్నారు. కరోనా నేపథ్యంలో ఆరోగ్యంపై శ్రద్ధపెరగడం కూడా మద్యానికి దూరంగా ఉండటానికి ఒక కారణం. గతంలో విచ్చలవిడి బెల్టుషాపుల స్థానంలో నేడు బెల్టుషాపు కనబడితే ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. ఫలితంగా గతంలోలా ఎక్కడ పడితే అక్కడ మద్యం దుకాణాలు కనిపించడం లేదు. జిల్లాలో పేర్నమిట్ట వద్ద మద్యం డిపో-1, మార్కాపురం వద్ద మద్యం డిపో-2 ఉన్నాయి. అక్కడ నుంచి జిల్లాలోని దుకాణాలకు మద్యం సరఫరా అవుతోంది.

2018-19 నుంచి 2022-23 వరకు గణాంకాలు ఇలా:

సంవత్సరం	మద్యం విక్రయాలు (కేసుల్లో)	బీరు విక్రయాలు (కేసుల్లో)
2018-19	20,19,263	14,00,011
2019-20	16,21,037	10,24,621
2020-21	14,03,333	2,97,198
2021-22	17,62,945	4,09,654
2022-23	16,76,666	6,04,404

బాబు హయాంతో పోలిస్తే 20 శాతం తగ్గిన మద్యం అమ్మకాలు:

2022-23 సంవత్సరంలో జరిగిన మద్యం అమ్మకాలు...చంద్రబాబు సీఎంగా ఉన్న 2018-19 మధ్య జరిగిన అమ్మకాలతో పోలిస్తే 17 శాతం తగ్గుదల నమోదైంది. ఇక బీరు అమ్మకాలు ఏకంగా 51.13 శాతం తగ్గాయి. చంద్రబాబు అండ్ బ్యాచ్ మాత్రం ఇది జీర్ణించుకోలేకపోతోంది. మద్యం మత్తు లేకుంటే జనం ఆలోచించడం మొదలుపెడతారు. వారు ఆలోచించడం ప్రారంభిస్తే తమ పనైపోతుందని భావించి.. ఏదో ఒక విధంగా తాము అధికారంలోకి వస్తే మత్తులో ముంచి తేలుస్తాం అంటూ మందుబాబులను ఆకట్టుకునేందుకు ప్రకటనలు గుప్పిస్తున్నారు.

గణనీయంగా తగ్గిన ఏప్రిల్ విక్రయాలు:

సంవత్సరం	మద్యం కేసుల సంఖ్య	బీరు కేసుల సంఖ్య
2019 ఏప్రిల్	1,55,681	1,92,573
2023 ఏప్రిల్	75,109	53,535



ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది



కరోనా వల్ల చాలామంది మద్యం తాగడం తగ్గించారు. దానికి తోడు నిర్ణీత వేళల్లో మాత్రమే ప్రభుత్వ మద్యం దుకాణాలు తెరుస్తుండడం, మద్యం ధరలు పెరగడం వంటి కారణాలతో మద్యం వైపు ఆసక్తి తగ్గింది. ప్రజలు ఆరోగ్యంపై దృష్టిపెట్టారు. అందువల్ల గత నాలుగేళ్లలో దాదాపు 20 శాతం వరకు మద్యం అమ్మకాలు పడిపోయాయి. బీరు అమ్మకాలు అయితే ఏకంగా 50 శాతానికిపైగా పడిపోయాయి. మద్యరహిత సమాజం దిశగా వెళ్తున్నారనేందుకు ఇవి నిదర్శనం.

– ఆర్.హనుమంతరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్

గతంతో పోలిస్తే మెరుగైన జీవనం



మా దుకాణం ఎదురుగానే మద్యం దుకాణం ఉంటుంది. అప్పట్లో ప్రైవేటు దుకాణం, ఉదయం ఆరుగంటలకే షాపు బార్లా తెరిచి ఉండేది. దీంతో పనికి వెళ్లాలనుకుని పట్టణానికి వచ్చిన వ్యక్తులు కూడా మద్యం తాగి అక్కడే పడిపోయేవారు. చూసేందుకు జుగుప్సగా ఉండేది. కానీ నేడు పరిస్థితి మారింది. మద్యం ధరలు పెరగడం, అమ్మకాలకు నిర్ణీత వేళలు అమలు చేస్తుండటం వల్ల ఉదయం పూట మందుబాబుల సంఖ్య గణనీయంగా తగ్గింది. తాగి రోడ్లపై పడిపోతున్న ఘటనలు దాదాపు కనిపించడంలేదు. ధర పెరిగిందనే దానికన్నా ఆరోగ్యం మెరుగవుతుందని, కుటుంబాలు బాగుపడుతున్నాయన్న సంతృప్తిని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

– షేక్ ఇందాత్, వ్యాపారి, అద్దంకి బస్టాండు, ఒంగోలు

నిర్ణీత సమయంలో సమస్యలు పరిష్కరించాలి

- స్పందన నిర్వహించిన జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత



సమస్యలు తెలుసుకుంటున్న డీఆర్‌ఓ శ్రీలత

ఒంగోలు అర్బన్: అధికారులు, ఉద్యోగులు ప్రజల సమస్యలను నిర్ణీత సమయంలో క్షేత్ర స్థాయిలో పరిశీలించి చిత్తశుద్ధితో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) సూచించారు. సోమవారం స్పందన భవనంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పందన అర్జీలు పెండింగ్‌లో లేకుండా చూసుకునేందుకు మొక్కుబడిగా పని చేయకుండా కచ్చితత్వంతో పనిచేయాలన్నారు. పరిష్కారం చేయలేని సమస్యలు ఉన్నప్పుడు అర్జీదారులను పిలిపించి వారికి అర్థమయ్యేలా వివరించాలన్నారు. సమస్యలు పునరావృతం కాకుండా పరిష్కరించాలన్నారు. దీనిలో పలువురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు పాల్గొన్నారు.

– కొరిశపాడు మండలం కుర్రవానిపాలేనికి చెందిన కట్టా రవితో పాటు పలువురు స్పందనలో అధికారులను కలిసి సమస్యలను చెప్పుకున్నారు. టంగుటూరు మండలం కొణిజేడులో తనతో పాటు 25 మంది వ్యవసాయ కూలీలు పచ్చాకు పనులకు వెళ్లామని, అయితే పనులు అయిపోయినా రైతులు చెల్లించాల్సిన కూలీ డబ్బును చెల్లించలేదని ఫిర్యాదు చేశారు. ఈ విషయం అక్కడి పోలీసులకు తెలిపినా న్యాయం జరగలేదని, పరిశీలించి తమ కూలీ డబ్బును ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు.

– కనిగిరి మండలం పట్టాభిరామపురం, బడుగులేరు పంచాయతీకి చెందిన మాసా నాగేశ్వరరావు స్పందనలో అధికారులను కలిసి తనకు వారసత్వంగా వచ్చిన భూమిని ఆన్‌లైన్ చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు. సర్వే నంబర్ 497లో 3.10 ఎకరాల భూమి అనువంశికం ద్వారా అన్నదమ్ముల భాగ పంపిణీలో వచ్చిందని, ఆ భూమికి సంబంధించి 1బీ, అడంగల్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లు ఉన్నా ఆన్‌లైన్ చేయడం లేదన్నారు.

సమస్యల పరిష్కారానికే స్పందన

- పిటిషన్ల సత్వర పరిష్కారమే ప్రభుత్వ యంత్రాంగ పనితీరుకు నిదర్శనం
- మంత్రి ఆదిమూలపు సురేష్
- పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎమ్మెల్యే కేపీ



అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి సురేష్ పక్కన కలెక్టర్ దినేష్‌కుమార్, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: సమస్యల పరిష్కారం కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. సోమవారం మార్కాపురంలోని సౌజన్య ఫంక్షన్ హాల్లో స్పందన కార్యక్రమం కలెక్టర్ దినేష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సురేష్ మాట్లాడుతూ స్పందన పిటిషన్లకు సత్వర పరిష్కారమే అధికార యంత్రాంగ పనితీరుకు నిదర్శనమన్నారు. స్పందనలో అర్జీ ఇస్తే తమ పరిష్కారమవుతుందన్న విశ్వాసం ప్రజల్లో ఉందన్నారు. వచ్చిన ప్రతి అర్జీకి ప్రాధాన్యత ఇచ్చి సమస్యలను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సురేష్ అన్నారు.

నియోజకవర్గ స్థాయిలో స్పందన:

గత ఏడాది లాగా ఈ సారి కూడా అన్ని నియోజకవర్గాల్లో స్పందన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ చెప్పారు. ఈ క్రమంలోనే మార్కాపురం నియోజకవర్గాన్ని ముందుగా ఎంపిక చేసి స్పందనను నిర్వహించామన్నారు. మొత్తం 310 అర్జీలు వచ్చాయని, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందు కోసం సబ్ కలెక్టర్‌ను నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్‌గా నియమించినట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో అర్జీలు పరిష్కారమైన తీరును పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్జీలను నిర్లక్ష్యం చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు

క్షేత్ర స్థాయిలో అర్జీల పరిష్కారం:

క్షేత్రస్థాయిలోనే ప్రజల అర్జీలను పరిష్కరించేలా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. ముందుగా జిల్లాలో మార్కాపురాన్ని ఎంపిక చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలిచ్చిన సమస్యల అర్జీలను అధికారులు త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, సబ్ కలెక్టర్ సేధుమాధవన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్‌అలీ, డీపీవో నారాయణరెడ్డి, ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి, డీఈఓ రమేష్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంతరావు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ బాబురావు, ఆర్డీవో అమర్‌నాయక్, స్పెషల్ కలెక్టర్ సరళ వందనం, మున్సిపల్ ఛైర్మన్ బాలమురళీకృష్ణ, వివిధ శాఖల అధికారులతో పాటు డివిజన్‌లోని పలువురు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. 12 మండలాల ప్రజలు హాజరై అర్జీలు ఇచ్చారు.

సుపరిపాలన అందిస్తున్న ఘనత జగన్‌దే



గడప గడప కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఆదిమూలపు సురేష్

- మంత్రి ఆదిమూలపు సురేష్
- పెద్దదోర్నాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

పెద్దదోర్నాల: రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడుకుంటూ అందరికీ సంక్షేమ పథకాలు అందేలా సుపరిపాలన చేస్తున్న ఘనత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిదేనని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కొనియాడారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గంటా రమణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విప్లవాత్మకమైన నిర్ణయాలతో వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్న ఘనత సీఎందేనని పేర్కొన్నారు. ఎన్నికల ముందు జగనన్న చేసిన సుదూర పాదయాత్రలో పొదుపు మహిళలు తాము చేసిన అప్పులు కట్టలేక నలిగిపోతున్న పరిస్థితిని కళ్లారా చూశారన్నారు. మహిళల అప్పులను విడతల వారీగా రద్దుచేస్తానని ఆనాడు మాట ఇచ్చారన్నారు. ఆ మాట ప్రకారమే నవరత్నాల్లో చేర్చి విడతల వారీగా నగదును నేరుగా మహిళల అకౌంట్‌లలో జమ చేశారని చెప్పారు. వైఎస్ జగన్ హయాంలో భూ కబ్జాలు లేవని అన్నారు. ఆయన నాలుగేళ్ల పాలన జవాబు దారితనంలో సాగిందన్నారు. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కరోనా కష్ట కాలంలో కూడా పాలనను సజావుగా ముందుకు తీసుకెళ్లగలిగారని అన్నారు. అమ్మ ఒడి, వైఎస్సార్ భరోసా, నేతన్న నేస్తం, కాపు నేస్తం, ఆసరా, చేయూత, విద్యాకానుక, వసతి దీవెన, విద్యా దీవెన లాంటి పథకాలను ఆపకుండా పరిపాలన చేసిన ఘనత జగన్‌మోహనరెడ్డిదే అని చెప్పారు. గతంలో టీడీపీ నేతలు అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్క వాగ్దానం నెరవేర్చలేక పోయారని విమర్శించారు. వైఎస్సార్ అధికారంలో ఉన్న సమయంలో పొదుపు మహిళలకు పావలా వడ్డీకే రుణాలు ఇచ్చారని, ఆయన తనయుడు మరో అడుగు ముందుకేసి సున్నా వడ్డీకే రుణాలు ఇప్పిస్తున్నారని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్ పనులను వేగవంతంచేసి మొదటి టన్నెల్ పూర్తి చేశారని చెప్పారు. ప్రభుత్వ పథకాలతో కూడిన కరపత్రాలను ప్రతి కుటుంబంలోని పెద్దలకు అందజేసి వారు ప్రభుత్వం నుంచి ఎంత లబ్ధి పొందారో వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డుమావత్ లతాబాయి, సర్పంచ్ చిత్తూరి హారిక, ఎంపీడీఓ నాసర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భ్రమరాంబికాదేవి, పంచాయతీ కార్యదర్శి మోహనరావు, ఏపీఎం పోలయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యులు అమిరెడ్డి రామిరెడ్డి, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, గంటా గురవారెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు వెన్నా కాశిరెడ్డి, మండల నాయకులు అమిరెడ్డి లక్ష్మీరెడ్డి, గుమ్మా యల్లేష్, చంద్రకాంత్‌నాయక్, దూదేకుల కార్పొరేషన్ డైరక్టర్ దూదేకుల ఖాశింపీరాతో పాటు మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికుల ఐక్యతకు నిదర్శనం మేడే

- ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత
- వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా మేడే వేడుకలు



వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో కార్మిక జెండా ఎగుర వేసి నినాదాలు చేస్తున్న మేయర్ గంగాడ సుజాత, ఒడా ఛైర్‌పర్సన్ మీనాకుమారి, కార్పొరేటర్లు, కార్మిక సంఘ నాయకులు

ఒంగోలు: కార్మికుల ఐక్య ఉద్యమాలకు మేడే నిదర్శనమని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మేకల చిన్నతిరుపతి యాదవ్, ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షుడు పుచ్చకాయల గోవర్ధన్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన వేడుకకు నగర మేయర్ గంగాడ సుజాత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్ పతాకం ఎగురవేయడంతోపాటు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ 1884లోనే అమెరికాలో 8 గంటల పనిదినం కోసం 40 వేలమందికి పైగా కార్మికులు రోడ్డెక్కి ఉద్యమం చేశారన్నారు. ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రయత్నించినా.. తదుపరి సంవత్సరాల్లో కార్మికులు శక్తి పుంజుకుని లక్షలాదిగా ఐక్యమై గర్జించడంతో 8 గంటల పని దినం ఏర్పడిందన్నారు. అమెరికాలో మొదలైన ఈ ఉద్యమం యూరప్ ఖండానికి వ్యాపించిందని మేడే ప్రత్యేకతను వివరించారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ సింగరాజు మీనావెంకట్రావు మాట్లాడుతూ బానిసత్వం సంకెళ్లు తెంచుకుని 8 గంటల పనిదినం ఆకాంక్షను నెరవేర్చుకున్న మహోన్నత రోజు మేడే అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా కార్మికులు, శ్రామికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు చేస్తున్న కృషి ప్రజల హృదయాలను హత్తుకుందన్నారు. ట్రేడ్ యూనియన్ జిల్లా, నగర అధ్యక్షుడు మేకల చిన్న తిరుపతి యాదవ్, గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నవరత్నాలతోపాటు కార్మికుల కోర్కెలను తీర్చడంలో సీఎం వైఎస్ జగన్ చూపుతున్న శ్రద్ధ అద్వితీయం అన్నారు. కాంట్రాక్టు కార్మికులను కూడా పర్మినెంట్ చేసే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నట్లు మంత్రి బొత్స సత్యన్నారాయణ పేర్కొన్న దృష్ట్యా త్వరలోనే కాంట్రాక్టు కార్మికుల జీవితాల్లో కూడా వెలుగులు రానున్నట్లు పేర్కొన్నారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు, చేనేత కార్మికులకు ప్రత్యేకంగా ఆర్థికసాయం అందించడంతోపాటు ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు దామరాజు క్రాంతికుమార్, టైలర్స్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ షేక్ సుభాన్‌బీ, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నాయకులు వీరాస్వామిరెడ్డి, వల్లెపు మురళి, ఇనగంటి పిచ్చిరెడ్డి, దుంపా చెంచిరెడ్డి, దుంపా యలమందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు 78.91 శాతం పింఛన్ల పంపిణీ

ఒంగోలు సబర్బన్: సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా ఈనెల తొలిరోజు సోమవారం మేడే సెలవు దినం అయినా వలంటీర్లు ఇంటింటికీ తిరిగి అందజేశారు. జిల్లాలో మొత్తం 2,83,239 సామాజిక పింఛన్ లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.78.71 కోట్లు విడుదల చేసింది. అందులో తొలిరోజు 78.91 శాతం మందికి వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేశారు.



ఒంగోలు విజయనగర్ కాలనీలో పక్షవాతంతో మంచంలో ఉన్న డి.వెంకటేశ్వర్లుకు రూ.5 వేలు పింఛన్ అందిస్తున్న వలంటీర్

సత్తా చాటిన యర్రబాలెం ఎడ్లు


బండను లాగుతున్న ఎడ్లు

బేస్తవారిపేట: మండలంలోని గంటాపురంలో పట్టాభిరామస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా సోమవారం రాష్ట్రస్థాయి ఎండ లాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో కంభం మండలం యర్రబాలెంకు చెందిన వెంకటగిరి హేమలతా నాయుడు ఎడ్లు 4536 అడుగుల దూరం లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. నంద్యాల క్రాంతినగర్‌కు చెందిన ఎం భావనరెడ్డి, బురుజుపల్లెకు చెందిన ఎదురు శ్రీనివాసరెడ్డి ఎడ్లు 4481 అడుగులతో ద్వితీయ, పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన బత్తుల చిన్నబ్బాయ్ యాదవ్ ఎడ్లు 4250 అడుగులతో తృతీయ, గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడు నవీన్‌కుమార్ ఎడ్లు 3897 అడుగులతో నాల్గవ, వైఎస్సార్ జిల్లా రూకావురం విద్యా ఓబుల్‌రెడ్డి ఎడ్లు 3550 అడుగులు లాగి ఐదవస్థానంలో, రాచర్ల మండలం అక్కపల్లె బత్తుల రాజశేఖర్ ఎడ్లు 2750 అడుగులతో ఆరవ, కంభం మండలం సూరేపల్లికి చెందిన బీరం వెంకటరెడ్డి ఎడ్లు 2347 అడుగులతో ఏడవ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు వరుసగా రూ.40 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలు, రూ. 3500 అందజేశారు.

చిన్నారులకు మెరుగైన సేవలు

● మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్


ఐసీడీఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సురేష్

పెద్దదోర్నాల: అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరే చిన్నారులకు మెరుగైన సేవలను అందించి, వారి ఆరోగ్యాన్ని సంరక్షించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఐసీడీఎస్ సీడీపీఓ, పద్మావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీలను ఉద్దేశించి మంత్రి సురేష్ మాట్లాడారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాలైన ఈ ప్రాంతంలో కార్యాలయాన్ని ప్రారంభించడం ఎంతో శుభపరిణామమన్నారు. అంగన్‌వాడీల సమస్యలను తీర్చటంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపుతుందన్నారు. చివరి మండలాలైన పెద్దదోర్నాల, పెద్దారవీడులలో చెంచు గిరిజనులు అత్యధికంగా నివసిస్తున్నారని పేర్కొన్నారు. గిరిజనుల్లో అత్యధిక శాతం రక్త హీనతతో బాధపడుతున్నారని, వారి ఆరోగ్య సంరక్షణకు పాటు పడాలన్నారు. ఎంతో మంది గిరిజన చిన్నారులు తక్కువ బరువుతో జన్మిస్తున్నారన్న విషయాన్ని గమనించి వారి పట్ల శ్రద్ధ వహించాలన్నారు. సిబ్బంది సకాలంలో కేంద్రాలను తెరిచి మెరుగైన సేవలను అందించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి మహిళా పక్షపాతి అని, ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల నగదు వారి ఖాతాల్లోనే పడుతున్న విషయాన్ని గుర్తు చేశారు.

ఫిష్ ఆంధ్ర మొబైల్ వాహనాలు ప్రారంభం

మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఫిషరీస్ పీడీ చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పుల్లలచెరువు, యర్రగొండపాలెం మండలాల లబ్ధిదారులకు మంత్రి ఆదిమూలపు సురేష్ ఫిష్ ఆంధ్ర మొబైల్ వాహనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీలతో మత్స్యకారులకు ఫిష్ వాహనాలను అందిస్తుందన్నారు. ఈ వాహనంలో తాజాగా ఉన్న చేపలను మండలంలోని అన్ని ప్రాంతాల్లో విక్రయించుకోవచ్చని అన్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా ఐస్ బాక్స్‌లతో పాటు శుభ్రం చేసుకునేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు ఉన్నాయన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందించే యూనిట్లను వినియోగించుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. అంతకు ముందు చిన్నదోర్నాలలో జరిగిన ఎల్లమ్మ కొలుపుల్లో పాల్గొన్న మంత్రి సురేష్ ఎల్లమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ మాజీ అధ్యక్షుడు జంకె ఆవులరెడ్డి ఆరోగ్యంపై ఆయన కుమారుడు జంకె రామచంద్రారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జడ్డు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మార్కెట్ యార్డులో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డుమావత్ లతాబాయి, సర్పంచ్ చిత్తూరి హారిక, మాజీ జెడ్పీటీసీ సభ్యులు అమిరెడ్డి రామిరెడ్డి, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ మజీద్, గంటా గురవారెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు వెన్నా కాశిరెడ్డి, మండల నాయకులు అమిరెడ్డి లక్ష్మీరెడ్డి, గుమ్మా యల్లేష్, చంద్రకాంత్‌నాయక్, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ దూదేకుల ఖాశింపీరా, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మల్లవరంలో వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వర స్వామి

మద్దిపాడు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మల్లవరం వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఆదివారం రాత్రి అంకురారోహణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు నారాయణం వెంకటాచార్యులు, రాజశేఖరాచార్యులు, యాజ్ఞీకులు దివి వెంకట శేషాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం ఉదయం 11 గంటలకు ఆలయ ధ్వజ స్తంభంపై గరుడ పతాకాన్ని ఆవిష్కరించి ప్రత్యేక పూజలు చేశారు. సంతానం లేని మహిళలకు గరుడ ప్రసాదాన్ని అందించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నారా నాగిరెడ్డి, ఈఓ దామా నాగేశ్వరరావు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

● కలెక్టర్ దినేష్‌కుమార్


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

మార్కాపురం: ఇంటర్మీడియెట్ ఫెయిల్ విద్యార్థులకు మంచి అధ్యాపకులతో ప్రత్యేక తరగతులు, ఉచిత భోజన వసతి కల్పించి శిక్షణ ఇస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్సు ద్వారా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు, కాలేజీలు, కేజీబీవీలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంఈఓలు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో మాట్లాడారు. ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల ఒకటి నుంచి 21 వరకు తరగతులు జరుగుతాయన్నారు. జిల్లాలో 4 కేంద్రాల్లో బాలురకు, 4 కేంద్రాల్లో బాలికలకు తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వెలుగొండ, అర్ధవీడు, దర్శి, చీమకుర్తిలోని సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజీలు, ఒంగోలులోని పీవీటీ జూనియర్ కాలేజ్, రాయవరం, కంభం, సింగరాయకొండలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కాలేజీల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అధికారులు ఫెయిల్ అయిన వారిని గుర్తించి సమాచారం అందించాలని తెలిపారు. వారిని ఉత్తీర్ణులను చేసేందుకు అధికారులంతా చొరవ చూపాలన్నారు.

ఇంటర్ పాసైన వారికి శిక్షణ

ఇంటర్ పాసైన వారికి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రాం గురించి విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంటర్‌లో 75 శాతం మార్కులుండి గణితంలో 60 శాతం మార్కులు వస్తే వారికి ఐటీ రంగంలో ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. ఇంటర్ చదువుతోనే హెచ్‌సీఎల్ కంపెనీతో ఒక పరీక్ష నిర్వహిస్తారని, అర్హత సాధించిన వారికి ఇంటర్వ్యూలు చేసి ఎంపికైన వారికి 6 నెలల పాటు శిక్షణ ఇస్తారన్నారు. నెలకు రూ.10వేలు జీతం ఇచ్చి ఉన్నత చదువుల కోసం బిట్స్ పిలాని, ఐఐటీ గౌహతిలో వీకెండ్ శని, ఆదివారాల్లో చదువుకునే అవకాశం ఉందన్నారు. వాళ్ల డిగ్రీ తరువాత ఎంటెక్ పూర్తి చేసుకోవచ్చొన్నారు. యాక్సిస్ బ్యాంక్‌లో రుణ సౌకర్యం కూడా కల్పిస్తారన్నారు. హెచ్‌సీఎల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో శాశ్వత ఉద్యోగయ్యే అవకాశం కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సేధుమాధవన్, సీఈఓ బాలిరెడ్డి, సోషల్ వెల్ఫేడ్ డీడీ లక్ష్మణ్‌నాయక్, డీఈఓ రమేష్ బాబు, ఇంటర్ బోర్డు ఆర్ఐఓ సైమన్ విక్టర్, ఎంప్లాయ్‌మెంట్ అధికారి భరద్వాజ్, వెంకటసుబ్బయ్య, డీఎల్‌డీఓ ఉషారాణి, నైపుణ్యాధికారి లోకనాథం, రాజ్‌కుమార్ పాల్గొన్నారు. స్పందన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సురేష్, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిలు జగనన్న సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

పోక్సో కేసులో నిందితుడు అరెస్టు

తాళ్లూరు: బాలికపై అసభ్యకంగా ప్రవర్తించిన కేసులో తూర్పుగంగవరం ప్రైవేట్ పాఠశాల డైరెక్టర్ మారం వెంకట రమణారెడ్డిని ఎస్సై ప్రేమ్‌కుమార్ సోమవారం అరెస్టు చేశారు. దర్శి కోర్టులో హాజరు పరచగా విచారించిన జూనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు ఎస్సై ప్రేమ్ కుమార్ తెలిపారు. నిందితున్ని ఒంగోలు సబ్ జైలుకు తరలించారు.

మద్దులూరులో రూ.13 లక్షలు చోరీ


ఇంటి తాళాలు, గడులను పరిశీలిస్తున్న డీఎస్పీ నాగరాజు


ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న ట్రైనీ ఐపీఎస్ అంకిత సురానా

● పొట్టేళ్ల విక్రయంతో వచ్చిన నగదు బీరువాలో దాచిన యజమాని
● వర్షం కారణంగా బావమరిది ఇంట్లో పడుకున్న వైనం
● యజమానిపైనే గ్రామస్తులు, పోలీసుల అనుమానాలు

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం మద్దులూరులో ఆదివారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. పొట్టేళ్లు విక్రయించగా వచ్చిన నగదులో రూ.10 లక్షలను బీరువాలో దాచి ఉంచగా దొంగలు దర్జాగా నొక్కేశారు. ఇంటి యజమాని గడ్డం వీరయ్య సోమవారం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. గడ్డం వీరయ్య అదే గ్రామానికి చెందిన చెన్నారెడ్డి సింగారెడ్డితో కలిసి పొట్టేళ్ల పెంపకం చేస్తుంటాడు. పది రోజుల క్రితం 98 పొట్టేళ్లను విక్రయించగా రూ.13 లక్షలు వచ్చాయి. ఆ డబ్బును ఇంట్లోని బీరువాలో దాచి ఉంచాడు. ఆదివారం రాత్రి భారీ వర్షం కారణంగా కరెంటు పోవడం, బావమరిది ఇంట్లో ఇన్వర్టర్ ఉండటంతో భార్య నాగవల్లితో కలిసి పడుకోవడానికి వెళ్లాడు. వెళ్లేముందు తన ఇంటి బయట తొలుత పడుకున్నప్పుడు దిండు కింద తాళాలు పెట్టి మరిచిపోయాడు. తెల్లవారిన తర్వాత వీరయ్య భార్య నాగవల్లి ఇంటికొచ్చి చూసేసరికి తలుపులు, బీరువా తెరిచి ఉన్నాయి. డబ్బు చోరీ అయినట్లు గుర్తించిన వీరయ్య, ఆయన భార్య నాగవల్లి సంతనూతలపాడు ఎస్సై వి.అంజనేయులకు సోమవారం ఉదయం ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని ట్రైనీ ఐపీఎస్ అంకిత సురానా మహావీర్, ఒంగోలు డీఎస్పీ నాగరాజు, సీఐ శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించారు. నాగవల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటి యజమానే సూత్రధారి?

చోరీలో పోయిన రూ.13 లక్షలను దొంగతనం పేరుతో ఇంటి యజమాని గడ్డం వీరయ్యే ప్రణాళిక ప్రకారం అపహరించినట్లు గ్రామస్తులు కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. వీరయ్య, చెన్నారెడ్డి సింగారెడ్డి పొట్టేళ్ల వ్యాపారంలో భాగస్వాములు. పది రోజుల క్రితం పొట్టేళ్లు విక్రయించగా కొన్నవారు రూ.13 లక్షలకుగాను రూ.10 లక్షలను వీరయ్యకు ఇచ్చారు. ఆ డబ్బును ముందు చెరిసగం తీసుకుందామని వీరయ్యతో సింగారెడ్డి చెప్పగా మిగిలిన డబ్బు కూడా రాగానే తీసుకుందామని వీరయ్య తన వద్దే ఉంచుకున్నాడు. రెండు రోజుల క్రితం మిగిలిన రూ.3 లక్షలు కూడా రావడంతో మొత్తం రూ.13 లక్షలను వీరయ్య వద్దే ఉంచుకొని రేపోమాపో పంచుకుందామంటూ సింగారెడ్డికి చెప్పాడు. తెల్లవారే సరికి డబ్బు మాయం కావడంతో అందరికీ అనుమానం మొదలైంది. పోలీసులు కూడా వీరయ్య కుటుంబాన్ని విచారించగా రూ.13 లక్షలను తమ ఇంట్లోనే పప్పు డబ్బాలో దాచినట్లు వెల్లడించారని విశ్వసనీయ సమాచారం. పూర్తి వివరాలు రెండు రోజుల్లో వెల్లడయ్యే అవకాశముంది.

రాష్ట్ర సాహిత్య అకాడెమీ డైరెక్టర్‌గా ‘కొల్లా’


చైతన్యకు అభినందనలు తెలియజేస్తున్న భువనేశ్వరి

అద్దంకి: ఏపీ స్టేట్ సాహిత్య అకాడెమీ డైరెక్టర్‌గా అద్దంకి పట్టణానికి చెందిన కొల్లా భువనేశ్వరిని నియమిస్తూ సోమవారం ప్రభుత్వ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. పదవి కాల పరిమితి రెండు సంవత్సరాలు. తనకు సాహిత్య అకాడెమీ డైరెక్టర్‌గా నియమించేందుకు కృషిచేసిన రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, మాజీ ఎమ్మెల్యే గరటయ్యకు, పెద్దలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. సాహిత్యాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు.

ఉరుముల వాన


పిడుగు పడి మృతి చెందిన కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి సురేష్

కొనకనమిట్ల/కురిచేడు: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఎండ వేడి నుంచి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కాగా కురిచేడు మండలంలో 9 ఎకరాల్లో వరి దెబ్బతింది.

పిడుగుపాటు మృతుడి కుటుంబానికి మంత్రి పరామర్శ

త్రిపురాంతకం: మండలంలోని మిరియంపల్లి గ్రామానికి చెందిన రావెళ్ల పుల్లయ్య పిడుగు పడి మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను మంత్రి సురేష్ సోమవారం పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, పార్టీ నాయకులు ఆర్‌వీ పిచ్చయ్య యాదవ్, దగ్గుల గోపాల్‌రెడ్డి, సుబ్బారావు, చల్లా యల్లారెడ్డి తదితరులు ఉన్నారు.


వరి ఓదెలను ఒద్దుకు చేరుస్తున్న రైతులు

అసైన్డ్ భూమికి నకిలీ రిజిస్ట్రేషన్

● పోలీస్ స్పందనలో ఎస్పీ మలికాగర్గ్‌కు బాధితుల ఫిర్యాదు


స్పందనలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: అసైన్‌మెంట్ భూమికి నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి అమ్మకానికి పెట్టిన కృష్ణాజిల్లా నూజివీడుకు చెందిన శివ వెంకట రంగారావు తన వద్ద రూ.10 లక్షలు వసూలు చేశాడని వెలిగండ్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన స్పందనలో ఎస్పీ మలికా గర్గ్‌కు ఫిర్యాదు చేశారు. అగ్రిమెంట్ చేయకుండా కాలయాపన చేస్తుంటడంతో అసలు విషయం తెలుసుకుందామని విచారించగా అది అసైన్‌మెంట్ పొలమని తేలిందని, దీంతో డబ్బులు తిరిగి ఇవ్వమని అడుగుతుంటే ఇవ్వకుండా తిప్పుకుంటున్నాడని వాపోయాడు. తనకు న్యాయం చేయాల్సిందిగా ఎస్పీకి విన్నవించుకున్నాడు. దేవదాయ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికిన మార్కాపురానికి చెందిన అఖిల్ కుమార్ తన వద్ద రూ.3 లక్షలు తీసుకున్నాడని, నకిలీ జాయినింగ్ ఆర్డర్ ఇచ్చి మోసం చేశాడని కొనకనమిట్ల గ్రామానికి చెందిన రాజశేఖర్ ఫిర్యాదు చేశారు. మొత్తం 56 మంది ఎస్పీని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించిన ఎస్పీ వారితో నేరుగా మాట్లాడి సమస్య పూర్వాపరాలను తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి చర్చించి ఆయా ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, డీటీసీ డీఎస్పీ రామకృష్ణ, ఐసీసీఆర్ సీఐ దుర్గాప్రసాద్, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం


వెంకటేశ్వర్లు (ఫైల్)


వెంకటేశ్వరరెడ్డి(ఫైల్)

కనిగిరి రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ ఘటన పట్టణ సమీపంలోని కొత్తూరు వద్ద ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం పట్టణంలోని కొత్తూరుకు చెందిన మడతల వెంకటేశ్వర్లు(42) లింగారెడ్డిపల్లికి చెందిన కొండా వెంకటేశ్వరరెడ్డి(57) ఇద్దరు తోడళ్లులు. ఆదివారం రాత్రి లింగారెడ్డిపల్లి కొత్తపల్లిలో జరిగిన ఆరాధనోత్సవంలో మొక్కు తీర్చుకునే క్రమంలో కొండా వెంకటేశ్వరరెడ్డి భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో పెరుగు తరుగు పడటంతో తీసుకొచ్చేందుకు కనిగిరికి వచ్చి బైక్‌పై తిరిగి వెళ్తున్నారు. మార్గమధ్యంలో కొత్తూరు సమీపంలో బ్రిక్స్ కంపెనీ వద్ద ఆగి ఉన్న సిమెంట్ లారీని వెనుక ఢీ కొట్టారు. ఈ దుర్ఘటనలో మడతల వెంకటేశ్వరరెడ్డి ఆదివారం రాత్రి కనిగిరి ఆస్పత్రిలో మృతి చెందగా తీవ్ర గాయాలైన కొండా వెంకటేశ్వరరెడ్డిని ఒంగోలు తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

మొక్కు తీర్చుకునేందుకు వచ్చి పరలోకానికి..

తెలంగాణలో బేల్దారి పనిచేసుకుని జీవించే కొండా వెంకటేశ్వరరెడ్డి ఆరాధనోత్సవం సందర్భంగా దేవుని మొక్కు తీర్చుకునేందుకు వచ్చి మృత్యువాత పడ్డారు. ఒకే కుటుంబంలో ఇద్దరు తోడళ్లులు మృత్యు ఒడికి చేరడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మడతల వెంకటేశ్వర్లుకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కాగా, కొండా వెంకటేశ్వరరెడ్డికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.